ప్రజాశక్తి
శుక్రవారం 13 జూన్ 2025
5
శ్రీ సత్యసాయి



మహిళల రక్షణకు చర్యలు

తన్మయి ఘటనలో వెంటనే స్పందించాం
మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ



విలేకరులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ


ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళల రక్షణ, భద్రతకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలూ తీసుకుంటున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలియజేశారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలో యువతులపై జరిగిన అఘాయిత్యాలను పరిశీలించేందుకు ఆమె అనంతపురం విచ్చేశారు. గురువారం నాడు అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగుర్రాలపల్లి గ్రామానికి చెందిన బాలికను పరామర్శించారు. అనంతరం హత్యకు గురైన తన్మయి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు మునుపు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మీడిమా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థిని తన్మయి హత్యకేసు విచారణ సమయంలో తల్లిదండ్రులు నిందితుడు నరేష్‌ని కాకుండా బాలు అనే మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారన్నారు. ఇతన్ని పోలీసులు అదే రోజు తీసుకొచ్చి విచారించారన్నారు. అతడికి సంబంధం లేదని తేలడంతో వదిలేశారన్నారు. హత్య అనంతరం నరేష్ పేరు బయటకొచ్చిందన్నారు. ఇందులో పోలీసుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. హత్య విషయం బయటకొచ్చాక సిఐ సరైన పద్ధతుల్లో వ్యవహరించకపోవడంతోనే చర్యలు తీసుకున్నట్టు వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో బాలికపై జరుగుతున్న లైంగిక దాడి రెండేళ్లుగా విషయం బయటకు తెలియలేదన్నారు. బాలికను భయపెట్టడంతో ధైర్యంగా బయటకు చెప్పలేకపోయిందని తెలిపారు. ఆ బాలిక ఏడు నెలల గర్భిణి అయిన తరువాత ఆరోగ్య సమస్యలతో విషయం బయటకొచ్చిందన్నారు. ఇలాంటి ఘటనలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు చోటు చేసుకుంటే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు నిరసన సెగ

దళిత, గిరిజన బాలికలపై జరిగిన అఘాయిత్యాలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద నిరసన చేపట్టారు. ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ వాహనాన్ని చుట్టుముట్టి ఘెరావ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పే ప్రయత్నం చేసినా నాయకులు వినకుండా వాహనానికి అడ్డంగా నిలబడ్డారు. పోలీసులు కలుగజేసుకుని వారిని పక్కకు తప్పించి ఆమెను ముందుకు వెళ్లేందుకు దారి చూపారు.





ఆగని అఘాయిత్యాలు..!

◆ ఏడాదిలోపు మూడు ఘటనలు ◆ బాధితులకు అందని తోడ్పాటు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది కాలంలో చోటు చేసుకున్న తీవ్రమైన నేరాల్లో మూడు ఘటనలున్నాయి. ఇక వెలుగులోకి రాకుండా అత్యాచార యత్నంతో ఆగినవి మరికొన్ని ఉన్నాయి. మహిళలపై జరుగుతున్న హింసను పూర్తిగా లేకుండా చేస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వాగ్దానాలు చేశారు. ఆచరణలో మాత్రం ఆఘాయిత్యాలు యథాతథంగా కొనసాగుతూనే ఉండటం గమనార్హం. బాధితులకు సత్వర న్యాయం అటుంచుతే... ఆర్థిక తోడ్పాటు అందివ్వడంలోనూ తీరని జాప్యం జరుగుతోంది.

అత్తా కోడళ్లపై దారుణం

గతేడాది అక్టోబర్ 13వ తేదీన శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు సమీపంలో ఒక పరిశ్రమ వద్ద కాపాలాగానున్న కుటుంబంపై కొంత మంది యువకులు అర్ధరాత్రి సమయంలో దాడి చేయడమే కాకుండా కుటుంబంలోని ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారు. ఈ దృశ్యాలు సిసి కెమోరాలోనూ నమోదవడంతో పెద్ద కలకలమే రేపింది. వలస కార్మికులుగా వచ్చిన ఆ కుటుంబంపై కుటుంబ సభ్యుల ఎదుటే అత్యాచారం జరిగింది. పోలీసులు రెండు రోజుల వ్యవధిలో నిందితులను పట్టుకున్నారు. పాత నేరస్తులే ఈ ఘటనకు పాల్పడినట్టు తేలింది.

బాలికపై అఘాయిత్యం

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ బాలికను రెండు సంవత్సరాలుగా 16 మంది దాక అత్యాచారం చేయడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. బాలికకు తండ్రి లేకపోవడం, తల్లి మతిస్థిమితం సరిగా లేకపోవడాన్ని అదునుగా చూసుకుని మొదట ఒక యువకుడు లోబరుచుకుని వీడియోలు చిత్రీకరించడం, దాన్ని బయటకు వైరల్ చేయడంతో అది సాకుగా చూపి వరుసగా 16 మంది రెండేళ్లుగా అత్యాచారం జరిపారు. బాలిక గర్భదాల్చి ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు పోలీసులు నిందితులను గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టులు చేశారు.

ఇంటర్ విద్యార్థిని హత్య

అనంతపురం జిల్లా కేంద్రం రామకృష్ణ కాలనీకి చెందిన ఓ యువతి తనను పెళ్లి చేసుకొమ్మని అడిగినందుకు యువకుడు ఆమెను బండరాయితో మోది హత్య చేశాడు. మూడు నెలల క్రితం పరిచయమైన వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆ తరువాత లేదని బుకాయించడంతో యువతి తన్మయి అతనిపై ఒత్తిడి చేసింది. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన నరేష్ ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లి రెండు రోజుల తరువాత హత్య చేశాడు. తల్లిదండ్రులు ఈనెల నాలుగో తేదీనే ఫిర్యాదు చేసినా పోలీసులు అనుకున్నంత వేగంగా స్పందిచకపోవడంతోనే తమ కూతురు మరణించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇలా వరుస ఘటనలు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి.

బాధితులకు అందని తోడ్పాటు

మహిళలపై అత్యాచారం, దాడి జరిగినప్పుడు న్యాయం అందే విధంగా, ఆర్థిక తోడ్పాటును అందించాలని చట్టాలు చెబుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకమైన వ్యవస్థ ఉంది. జరిగిన తీవ్రతను బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.5లక్షల వరకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. కాని 2018 నుంచి ఇప్పటి వరకు చాలా వరకు పెండింగులోనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 మంది వరకు బాధితులకు సహాయం అందాల్సి ఉంది. ఇందులో ఒక్క సత్యసాయి జిల్లా నుంచే 190 వరకు ఉన్నాయి. వీరికి రూ.38 లక్షల వరకు పరిహారం అందాల్సి ఉంది. రూ.13.30 లక్షలు మంజూరయ్యాయి. ఇది 50 మంది బాధితులకు సరిపోయింది. తక్కిన వారు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పటికి పరిహారం అందుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.



అడ్డుకుంటున్న పోలీసులను ప్రశ్నిస్తున్న ఉషశ్రీచరణ్

పరామర్శకు వెళ్తుంటే ఎందుకు భయం

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
ఏడుగుర్రాలపల్లికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-పెనుకొండ

దళిత బాలికను పరామర్శించేందుకు వెళ్తుంటే ప్రభుత్వానికి ఎందుకంత భయం అంటూ వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ప్రశ్నించారు. ఇటీవల రామగిరి మండలంలో ఏడుగుర్రాలపల్లి గ్రామంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైసిపి ఛలో ఏడుగుర్రాలపల్లి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పెనుకొండ నుంచి ఉషశ్రీ చరణ్ వెళ్తుండగా పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. పెనుకొండ వద్ద ఎస్ఐ వెంకటేశ్వర్లు వారిని అడ్డగించి వెళ్లేందుకు అనుమతి లేదంటూ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు, వైసిపి శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వైసిపి నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టడంతో భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌లో తొలగించేందుకు వైసిపి శ్రేణులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది వైసిపి నాయకులను బలవంతంగా జీపులో ఎక్కించుకుని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. పోలీసుల తీరుపై ఉషశ్రీ చరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా తమను అరెస్టు చేశారంటూ మండిపడ్డారు. బాధితురాలని కలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే తమను ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుంటోందన్నారు. ఎన్ని అడ్డంకులు సష్టించిన బాధిత కుటుంబ సభ్యులను కలిస్తామన్నారు.



ఎంపిడిఒ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

'ఆడుదాం ఆంధ్ర' నిధులపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-లేపాక్షి

గత వైసిపి ప్రభుత్వంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఖర్చు చేసిన నిధులపై గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. సచివాలయాలకు మంజూరైన నిధులు, ఆటవస్తువుల కొనుగోలు, ప్రస్తుతం ఆ వస్తువులు ఎక్కడ ఉన్నాయి. తదితర వివరాలపై విజిలెన్స్ ఎస్ఐ గోపాల్ స్థానిక పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు ఎంపిడిఒ నరసింహమూర్తి, ఏవో కుళ్లాయప్ప, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, రమేష్‌బాబు, మల్లికార్జున, సాయి, దుర్గయ్య ఉన్నారు.



రైతులకు మట్టి నమూనా పరీక్ష పత్రాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మట్టి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-లేపాక్షి

రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించి దాని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని కళ్యాణదుర్గం వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని కల్లూరు, లేపాక్షి పంచాయతీల్లో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త బాలాజీ నాయక్ రైతులకు మట్టి పరీక్షలు, నీటి పరీక్ష, వేరుశనగ, మొక్కజొన్న, కంది పంటల సస్యరక్షణ, ఆధునిక పరికరాలు ఉపయోగించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులు, డ్రోన్స్ ఉపయోగం, తదితర అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం రైతులకు మట్టి నమూనా పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రఘు, తిరుమలేష్, ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.1.2 లక్షల విరాళం

గోరంట్ల : పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వంటగది, తాగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు కోసం మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సోమశేఖర్‌శర్మ సొంత నిధులు రూ. 1.2 లక్షలు విరాళం అందజేశారు. దీంతో సోమశేఖర్ శర్మను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి-పెనుకొండ

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో పాటు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కృషి చేస్తోందన్నారు. పెట్టుబడులు, ప్రయివేటు రంగంలో ఉపాధి కల్పనకు అడుగులు పడ్డాయన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ప్రతి ఎకరాకు నీరిచ్చే కార్యక్రమం చేపట్టారన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, డివి.ఆంజనేయులు, రమణ, శ్రీనివాసులు, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్లు ఈశ్వరప్రసాద్, నరహరి, వెంకటేష్, గోవిందరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

గుడిబండ : కూటమి అధికారం చేపట్టి ఏడాదైన సందర్భంగా గుడిబండలో టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు స్థానిక బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ముందు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, దుర్గేష్, మంజు నాథ్, షబ్బీర్, ఎంపీటీసీ శశిధర్, డీలర్ల సంఘం అధ్యక్షులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు,



పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న వెంకటేశ్వరరావు, టిడిపి శ్రేణులు

సిద్ధార్థ గౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని డిహెచ్‌పిఎస్ కార్యాలయంలో గురువారం డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు ఆధ్వర్యంలో విద్యార్థులకు సిద్ధార్థ గౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ హాజరయ్యారు. ముందుగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా డిహెచ్‌పిఎస్ కార్యాలయం చేరుకన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సిద్ధార్థ గౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా విద్యను హక్కుగా పొంది రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తున్న ప్రతి ఒక్కరికీ అంబేద్కర్ శాశ్వతంగా గుర్తుండాలన్నారు. ఎంఆర్.హనుమంతు, ఎంఎస్.రఘునాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి పూలే, అంబేద్కర్ కన్న కలలను సాకారం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల తల రాత మార్చింది భారత రాజ్యాంగమే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబు, డిహెచ్‌పిఎస్ నాయకులు ఎం.శ్రీనివాస్, అంజి, కాంతరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు అంజి, శివ, జనసేన నాయకుడు పవన్, తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదంపై రఘువీరా దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమానం ప్రమాద ఘటనపై సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు.



తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఉన్న ఓ రైస్ మిల్లు వద్ద తాగునీటి పైపులైన్ పగిలి పది రోజులుగా నీరూ వృథా అవుతుండగా గత బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో 'తాగునీరు వృథా' శీర్షికన కథనం ప్రచురితమైది. దీంతో స్పందించిన ఈవోఆర్‌డి గోవిందప్ప ఆదేశాల మేరకు సచివాలయం-2 పంచాయితీ కార్యదర్శి లక్ష్మినారాయణ, సర్పంచి రూపా పైపులైన్ మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వాలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో బస్టాప్ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం వాలింది. ఈ స్తంభం సమీపంలోనే పెద్ద పెద్ద చింత చెట్లు ఉన్నాయి. ఈ మార్గంలో రైతులు తరచూ ట్రాక్టర్లలో పశుగ్రాసం తరలిస్తుంటారు. దీంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కావున ప్రమాదం జరగకనే విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెద్దగువ్వలపల్లి గ్రామంలో వాలిన విద్యుత్ స్తంభం

విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యాప్తంగా గురువారం రైతు సేవా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద మండల టిడిపి నాయకుల సమక్షంలో మండల వ్యవసాయ అధికారి కవితరాణి ఆధ్వర్యంలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతులు అధిక దిగుబడి సాధించేలా నాణ్యమైన విత్తనాలు, సాంకేతికతతో కూడిన పనిముట్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఇఒ అలేఖ్య, టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, సిద్ధలింగప్ప, మాగే చెరువు సర్పంచి నరసింహులు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, మద్దిలేటి, సచివాలయ, వ్యవసాయ శాఖల సిబ్బంది ప్రియాంక, సబీహా, బాబావలి, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రా లకు 1,603 క్వింటాళ్ల విత్తన కాయలు వచ్చాయన్నారు. 1168 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు సోమశేఖర్, నిమ్మల శ్రీధర్, చంద్ర, ఉత్తమరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. 978 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారని, వారికి 2,198 బ్యాగులు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, టిడిపి మండల కన్వీనర్ అభిషేక్, నాయకులు నరసింహమూర్తి, జయప్ప, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు



మడకశిర : అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని బూచేపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లు పూర్తయిన పిల్లలను అంగన్వాడీ సెంటర్‌కు తీసుకొచ్చి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లీలావతి, అరుణ, భాగ్యమ్మ, సాలెమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కల్లుమర్రి అంగన్వాడీ కేంద్రంలో సర్పంచి గంగమ్మ నాగరాజు సమక్షంలో చిన్నారుల చేత అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిడిపిఒ, అంగన్వాడీ కార్యకర్తలు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని కదిరేపల్లి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం చెన్నకేశవులు, రవిశంకర్‌రావు, రఘురామ్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మారుతిప్రసాద్, శ్యాంసుందర్, రమేష్, నాగార్జున, రాజగోపాల్, హరిప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కల్లుమర్రి జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఉచితంగా మూడు జతల దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి గంగమ్మ నాగరాజు, ఆయకట్టు సర్పంచి పెద్దమూర్తి, ఎస్ఎంసి ఛైర్మన్ నరసింహమూర్తి, మారుతిరెడ్డి, కొండప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచి, నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

క్షయపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు, గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వంద రోజులు టీవీ ఇంటెన్సెస్ పై డాక్టర్ సునీల్, డిటిసి సూపర్వైజర్ హబీబ్ భాషా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల ఎవరు నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. వ్యక్తి గత శుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమములో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను అందజేస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షురాలు సాకే యశోద, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు,తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, మాజీ ఎంపీపీ బాలు, మంజు, రామాంజి, అక్కులప్ప, వ్యవసాయ విస్తరణాధికారి మహిత, రైతు భరోసా సిబ్బంది గంగాధర్, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో..

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్లో వేరుశనగ సాగు చేసే రైతాంగానికి ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని గురువారం ప్రారంభించారు. రైతుసేవా కేంద్రంలో పలువురు రైతులకు కె 6 రకం విత్తన కాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, ఎంపీఈవోలు హరిప్రియ, హసీనా,తెలుగుదేశం నాయకులు జూబ్లీహిల్స్ నాయకుడు పళ్ళపోతల శ్రీరాములు,నెట్టెం అశోక్, మాల్యవంతం సర్పంచి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

పాఠశాలకు వచ్చే పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర ఎనలేనిదని మండల విద్యాధికారి గోపాల్ నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను జిల్లా స్థాయిలో జిల్లా స్థాయిలో ఉత్తమ విద్యార్థులు తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాధికారి సుబ్బిరెడ్డి, ఎంఆర్సి సిబ్బంది ఈశ్వర్ రెడ్డి, శంకర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని గోకులం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ విద్యుత్ అధికారి సత్యసాయి అనుగ్రహ వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు సూర్యనారాయణ రెడ్డి పెన్నులు, నోటు పుస్తకాలు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. గురువారం తన జన్మదిన వేడుకలను నిరాడంబరంగా విద్యార్థుల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు గంగిశెట్టి, ఉపాధ్యాయులు రాధా రాణి, పి. వి. రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి కదిరి టౌన్

యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆర్డీవో వివిఎస్ శర్మ స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కదిరి గర్ల్స్ కాలేజీలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలువురు యోగా నిర్వహించారు, కదిరి రెవిన్యూ డివిజనల్ అధికారితో పాటు ఎంపీడీవో పోలప్ప , తహశీల్దార్ మురళికృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ ,ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవిన్యూ అధికారులు మరియు యోగ గురువులు అందరు కలిసి దాదాపు 250 వరకు సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ మాట్లాడుతు యోగఉపయోగాలు, ప్రాముఖ్యతను వివరించారు.

పారిశుధ్యకార్మికులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గురువారం పారిశుధ్య కార్మికులకు పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఒ అంజనప్ప, ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఈవోఆర్డీ సునీత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, గడ్డపారలు పంపిణీ చేశామని తెలిపారు. పెండింగ్లో ఉన్న వేతనాలను 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరైన వెంటనే చెల్లిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్ భాష, ఓబులమ్మ, వసుంధర, రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, బాబ్జాన్, పారిశుధ్య కార్మికులు ఆక్కులప్ప, నరసింహులు, అంజి, కదిరప్ప, అనిల్తో పాటు 30 మంది కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు కిట్లు అందజేస్తున్న అధికారులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. గురువారం కార్యాలయం ముందు నిరసన తెలుపుతూ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు ఇచ్చారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ ఆప్కాస్ విధానం రద్దు చేస్తే కార్మికులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉందని, కాంట్రాక్టర్లకు అప్పగిస్తే కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు రమణ, రమేష్, గణేష్, రాందాస్, సద్దాం, బెస్త గంగాధర్, వెంకటేశు, రమణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు



జెండా ఆవిష్కరణలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, తదితరులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడిమర్రి

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయపద్రం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు కోరారు. మండలంలోని వీరభద్రయ్య గుడి దగ్గర సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఓబులు గురువారం ఆవిష్కరించారు, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాయడానికి కుట్ర పన్నాయని విమర్శించారు, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనం ఇవ్వాలని కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అసంఘటిత కార్మికులందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని స్కీం వర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నారాయణ, శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు, అంగన్వాడీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే



పీడీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళా సంక్షేమాభివృద్ధికి పాటుపడాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మెప్మా అధికారులకు సూచించారు. పుట్టపర్తి లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఎదురుగా పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలోని పీడీ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాలను పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని వీటిని ప్రజలకు తెలిజేయాల్సిన బాధ్యత మహిళా సంఘాలపై ఉందని అన్నారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రామాంజనేయులు, రామారావు, లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, సామకోటి ఆదినారాయణ, లాయర్ హరికృష్ణ, సూర్యనారాయణ, రామాంజనేయులు ,అబ్దుల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన నిధులను మునిసిపాలిటీకి బదిలీ చేయండి : బుక్కపట్నం సబ్ రిజిస్టార్ కార్యాలయం సంబంధించి నిలిచిపోయిన బిల్లులను పుట్టపర్తి మున్సిపాలిటీకి బదిలీ చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ట్రెజరీ అధికారులను కోరారు. ఆమె గురువారం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద గల జిల్లా ట్రెజరీ కార్యాలయాన్నిసందర్శించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రిజిస్ట్రేషన్ అవుతున్న భూములకు రావాల్సిన ప్రభుత్వ నిధులు పుట్టపర్తి జిల్లా ఖజానా కార్యాలయంలో సుమారు ఐదు కోట్లకు పైగా నిలిచిపోయాయని ఆ నిధులను పుట్టపర్తి మున్సిపాలిటీ కార్యాలయానికి బదిలీ చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఖజానా అధికారులకు సూచించారు. గత కొన్ని ఏళ్లుగా పుట్టపర్తి మున్సిపాలిటీకి ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావాల్సిన ప్రభుత్వ ఆదాయ పీజు జిల్లా ఖజానా కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని ఆ నిధులను పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి మళ్లించాలని కోరారు. మరో ఐదు మాసాల్లో శ్రీ సత్యసాయిబాబా 100వ శతజయంతి వేడుకలు రానున్నాయని గుర్తు చేశారు. పుట్టపర్తిలో రోడ్లు త్రాగునీరు, వీధిలైట్లు, నగర పరిశుభ్రత, పట్టణసుందరీకరణ పనుల కోసం నిధులు అవసరమని వెంటనే బుక్క పట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి జమ అయిన ప్రభుత్వ నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే జిల్లా ట్రెజరీ అధికారికి ప్రత్యేకంగా కోరారు. జిల్లా ఖజానా కార్యాలయంలో ఉన్న రిజిస్ట్రేషన్ భూముల నుంచి కట్టించుకున్న ప్రభుత్వ ఆదాయ ఫీజును ఆరు నెలలకు సంబంధించిన నిధులను వెంటనే పుట్టపర్తి మున్సిపాలిటీకి విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన బకాయిలను దశలవారీగా అందజేస్తామని ఎమ్మెల్యేకు వివరించారు.

మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మహిళా శిశు సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందనిఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఐసిడిఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ శిశు సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కషి చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో చాలా చోట్ల అంగన్వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణ కరువైందని ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా గర్భిణులకు, బాలికలకు అందజేయాలని ఎమ్మెల్యే ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడ అంగన్వాడి కేంద్రాలు అవసరమో తనకు వివరాలు ఇవ్వాలని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణానికి విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థుల సంఖ్యకు, సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టిసి డిపో మేనేజర్ కార్యలయం ఎదుట ఆందోళన చేసి, ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా పెనుకొండ, మడకశిర తదితర ప్రాంతాల గ్రామాల నుండి వేలాది మంది ప్రతినిత్యం విద్యాభ్యాసం హిందూపురానికి రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు విద్యాసంస్థల వేళలకు అనుగుణంగా అన్ని గ్రామాల నుండి బస్సులను నడపాలని కోరారు. అదే విధంగా బస్ పాస్ కౌంటర్ లో నిర్దేశించిన మొత్తం కంటే అధికంగా వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బస్ డిపో ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ అఫ్రిది, కో కన్వీనర్ అజ్మల్, ఇస్మాయిల్, ఉమేష్, కౌశిక్, మౌర్య, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



డిపో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నీలకంఠా రెడ్డి

ప్రతిభా విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో విద్యార్థుల్లో ఏకంగా ఇద్దరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించిన షైనింగ్ స్టార్స్ అవార్డులు దక్కడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠ రెడ్డి పేర్కొన్నారు. షైనింగ్ స్టార్స్ అవార్డు సాధించిన ఎస్ చంద్రకళ, ఎస్, ముస్రత్ బానును గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఇంటర్ లో ఈ గత విద్యాసంవత్సరంలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ లో ఎంపిసి విభాగంలో నీహారిఖ, అమూల్య 987, చంద్రకళ 982, మైత్రి 974, సిఈసిలో నుస్రత్ బాను 953, ప్రథమ సంవత్సరం ఇంటర్ లో ఎంపిసిలో అనూష 464, బైపిసిలో అక్షిత 435, ఎంఈసిలో రామ్ చరణ్ 472, సిఈసిలో చందన 487 మార్కులు సాధించారన్నారు. ఇందులో అందరికి రావాల్సి ఉందన్నారు. తమ కళాశాలలో ఇద్దరిని ఎంపిక చేసి మెడల్ ఇవ్వడంతో పాటు ఒక్కో విద్యార్థినికి రూ. 20 వేలు చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ చేతన్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షామీర్, హరి, శ్రీనాథ్, వరుణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ వి రత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆమె గురువారం జిల్లా కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. అనుమతులు లేకుండా ధర్నాలు రాస్తారోకోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సున్నితమైన విషయాలలో బాధిత కుటుంబాలను మరింత బాధపెట్టే విధంగా వ్యవహరిస్తూ , ధర్నాలు రాస్తారోకోలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రామగిరి మండలంలో బాధితుల పరామర్శ పేరుతో పోలీసుల అనుమతులు లేకుండా ధర్నాలు రాస్తారోకోలు చేపట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు చట్టం ఉందని, మైనర్ బాలిక సంఘటన విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనలు చేయడం ద్వారా బాధితుల వివరాలు బహిర్గతమై వారు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని అన్నారు. బాధితుల హక్కులకు ఎటువంటి భంగం కలిగించకుండా వ్యవహరించాలన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-హిందూపురం

అపరిచిత వ్యక్తుల పట్ల చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని ఆల్ ఇండాద్ ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సంఘటనను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఓ అపరిచిత వ్యక్తి గురువారం పట్టణంలోని పదేళ్ల చిన్నారిని ఐస్ క్రీం, చాక్లెట్ ఇప్పిస్తానని నగరిగెర, లేపాక్షి మధ్యలో వైన్ షాప్ దగ్గరికి తీసుకెళ్లాడు. అయితే ఈ విషయాన్ని గమనించిన ఆటో డ్రైవర్ రామాంజి సమాచారాన్ని లేపాక్షి లో ఉన్న బాబా దృష్టికి తీసుకెళ్లారు. దీనికి తోడు ఆ చిన్నారిని అపరిచిత వ్యక్తి నుండి కాపాడి బాబా వద్దకు చేర్చారు. బాబా హిందూపురంలోని అల్ ఇండాద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడికి సమాచారం అందించారు. దీంతో ట్రస్ట్ ప్రతినిధులు వెంటనే స్పందించి లేపాక్షికి చేరుకుని ఆ బాలికతో వివరాలను తెలుసుకొని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతి తల్లిదండ్రులు తమ చిన్నపిల్లలకి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తమ ట్రస్ట్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు ఎం.డీ.ఎస్ అమన్, ప్రతినిధులు సాదిక్, రహన్, బాబా ఫక్రుద్దీన్, మూయిన్, ఆరిఫ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదామని ఆర్డీవో వీఎస్ శర్మ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ దినోత్సవాన్ని పురస్కరించుకొని కదిరి రెడ్స్ సంస్థవారు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవ ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్ మరియు చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోస్టర్లను కదిరి ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ బాల కార్మిక చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపల పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. దువుకోవాల్సిన వయసులో విద్యార్థులు పని చేయించడంతో వారు ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. రెడ్స్ కోఆర్డినేటర్ ఎల్లప్ప మాటాడుతూ రెడ్స్ సంస్థ కదిరి ప్రాంతం లో గత 30 సంవత్సరాలుగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాలపైన అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈకార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, రెడ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహన ఫిట్నెస్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలో గురువారం నుంచి వాహన ఫిట్నెస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సత్యసాయి జిల్లా కేంద్రానికి గాను మండల కేంద్రంలో వాహన ఫిట్నెస్, కాలుష్యం, బాడీ పెయింటింగ్ సేవలను గురువారం ప్రారంభించారు. సత్యసాయి జిల్లా గాను నూతనంగా ప్రవేట్ నిర్వాహకులచే, ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సేవ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న లారీలు ప్రైవేట్ వాహనాలు తదితర వాహనాలన్నిటికీ నూతనంగా కంప్యూటర్ ద్వారా వాహన పరీక్షలు నిర్వహించి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు విరూపాక్ష రెడ్డి తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

వందేళ్ల చరిత్ర కలిగిన మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామని ప్రధానోపాధ్యాయులు పాండురంగ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ఎంజీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన పాండురంగ నాయకులునుఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, విద్యార్థుల సహకారంతో పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ టి రామిరెడ్డి గారు పీడీలు లోకనాథ్, సురేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి డిపో మేనేజర్లతో పాటు సిబ్బంది అందరూ చిత్తశుద్ధితో కృషి చేద్దామని జిల్లా ఆర్టీసీ రవాణా శాఖ అధికారి టి. మధుసూదన్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని తన చాంబర్లో జిల్లాలోని ఆరు డిపోల మేనేజర్లు, సూపర్వైజర్లు, గ్యారేజ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిపోల వారీగా సమీక్షిస్తూ డిపో మేనేజర్లు ఆదాయ మార్గాలను అన్వేషించి లాభాల బాటలోకి రావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి డిపోలో నష్టాలను తగ్గించే విధంగా పర్యాటక కేంద్రాలకు ఆధ్యాత్మిక కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయం గడించాలన్నారు. సూపర్వైజర్లు ఆదాయం రాణి రూట్లలో ప్రయాణించి ఆ రూట్ ల ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కెఎంపిఎల్ పెంచడంతోపాటు ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలన్నారు. పుణ్యక్షేత్రాలకు సమయానుకూలంగా బస్సులు నడిపి జిల్లాను ఆదాయంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరు డిపోల మేనేజర్లు, సూపర్వైజర్లు, అకౌంట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై టిడిపి సంబరాలు



హిందూపురంలో టిడిపి నాయకుల సంబరాలు



తలుపులలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- హిందూపురం

కూటమి ప్రభుత్వం ఏర్పడి అయిన సందర్భంగా టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ లో ఉన్నా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కిరికెర మాజి సర్పంచి, రూరల్ కన్వీనర్ రాము ఆధ్వర్యంలో తూమకుంట చెక్ పోస్టు వద్ద ఉన్నా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అశ్యక్షులు వెంకటేష్, నాయకులు నెట్టప్ప, ఆర్ఎంఎస్ షఫీవుల్లా, తిమ్మయ్య, అమర్నాథ్, శవ శంకర్, కౌన్సిలర్ రాఘవేంద్ర, జనసేన నాయకులు ఆకుల ఉమేష్, నిమ్మకాయల రాము, బిజెపి ఆదర్శ్ కుమార్ తో పెద్ద ఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ :ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే స్వర్ణాంధ్ర సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో కలిసి గురువారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నో అభివద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామాంజనేయులు, బెస్త చలపతి, రామలక్ష్మణులు, సామ కోటి ఆదినారాయణ, విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీరామ్ నాయక్, బొమ్మయ్య, భాగ్య, మాధవి, రాధా, కూటమి నాయకులు లాయర్ హరికృష్ణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట :కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పంకమద్ది నరసింహులు, దండే రవిశంకర్, శ్రీరాముల నాయుడు, పాలగిరి మౌలా, బేల్దారి ప్రభాకర, బత్తిన గారి పల్లి వేమన్న, కోడి రెడ్డప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల :స్థానిక మూడు రోడ్ల కూడలిలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. అధికారం చేపట్టిన వెంటనే మొదటి సంతకం డీఎస్సీ పై పెట్టి నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. వచ్చే కాలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, కో కన్వీనర్ రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి జయచంద్ర, వీర భార్గవ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి,శంకర, కొమ్మర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పాఠశాలలు పున్ణ ప్రారంభం కాగానే ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేసి తల్లుల ఖాతాలో జమ చేసిందని హర్షం వ్యక్తం చేస్తూ టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా నల్లమాడ మండల టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిట్టు నాగభూషణం, మంజునాథరెడ్డి, రవీంద్ర, పూలరామయ్య, ఎన్ నరసింహులు, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో టిడిపి నేతలు. కార్యకర్తలు కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు అబ్దుల్ ఖాదర్. నాగభూషణ్ నాయుడు.మాజీ ఎంపీపీ మాబు సాబ్.సీనియర్ మైనారిటీ నాయకులు బషీర్ అహ్మద్.సర్పంచ్ హర్షవర్ధన్ నాయుడు.మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అశ్వర్థ నాయుడు తదితరులు పాల్గొన్నారు.